మణిమాల

జనార్ధనరావుగారు

మిత్రులు కొంపెల్ల జనార్దనరావుగారు చనిపోయినందుకు చాలా విచారిస్తున్నాను.

బతకవలసినట్టిన్నీ, బతకతగినట్టిన్నీ కాలం యెంతో వున్నది. చెయ్యవలసినట్టిన్నీ, చెయ్యతగినట్టిన్నీ పని కూడా యెంతో వున్నది.

వాటికి తగిన సంకల్పమూ, ప్రయత్నమూ, ప్రారంభమూ కూడా జటిలంగానే వున్నవి.

కాని హఠాత్తుగా మరణం సంభవించింది.

ఇది అకాలమృత్యువు గాని కాలమృత్యువు కాదు పైగా యిది చేతులారా ఆంధ్రజాతే తెచ్చిపెట్టినది.

జనార్దనరావుగారు ప్రతిష్ఠకోసం ఆశించలేదు. డబ్బుకోసం చేతులు చాపలేదు. వైభవమున్నా వాంఛించలేదు.

వారు పని చేస్తామన్నారు. నడుము కట్టుకొని కార్యక్షేత్రంలో ప్రవేశించారు.

కాని విశాలమైన ఆంధ్రదేశంలో—హిందూదేశం మొత్తంమీద మూడో స్థానం ఆక్రమించిన ఆంధ్రజాతిలో ఆయనచేత పని చేయించగల మొనగాడు లేకపోయాడు.

* * *

గుప్పెడు తాటాకులూ వొక గంటమూ పుచ్చుకుంటే పూర్వకాలంలో కవుల పని తీరిపోయేది.

అప్పటివారికి తమ కవితాధోరణికి రూపం కల్పించుకోవడమూ, తమ పాండిత్యం ప్రకటించుకోవడమూ—ఇదే పరమావధి.

ఇప్పుడలా కాదు. కవులు అలా తృప్తిపడడానికిప్పుడు వీలులేదు.

కవిత్వమూ, తదంగమైన విమర్శనా యిప్పుడు జాతీయతా నిర్మాణానికి ప్రధానసాధనాలుగా గుర్తించబడ్డవి. అంచేత కవికైనా విమర్శకుడికైనా యిప్పుడు వొక జపాను నోటుబుక్కూ, ఫౌంటెన్ కలమూ పుచ్చుకుని రాసేసి వూరుకుంటే చాలదు.

ఆరచన అచ్చువేయించాలి. దేశంమీద విరజిమ్మాలి. నలుగురిచేతా చదివించాలి. జాతి పురికొనేటట్టు చెయ్యాలి.

ఇది కభుర్లతో కాదు. పుష్కలమైన ధనం కావాలి.

జనార్దనరావుగారు కొంగు చాపి యాచించారు.

తమ సొంతానికా? కాదు. ఇందుకోసం. ఇంత పని చెయ్యడానికి.

ఆయన బండికోసం యెదురుచూడలేదు. నడిచి వెళ్లారు. పంచభక్ష్యపరమాన్నాలు తలుచుకుని ఉవ్విళ్ళూరలేదు. చారూ అన్నమూ వీటితో తృప్తి పడ్డారు. ఉజ్జ్వలమైన వేషంకోసం అవస్థపడలేదు. అభిజనులతో కలిసి తిరగడానికి ఎంత సామాన్య దుస్తులు అర్హమైనవో అంతవాటితోటే తృప్తి పడ్డారు.

అయితే: కాగితాలు కావాలి. అచ్చుపడాలి. పోస్టేజీ కావాలి. ఇందులో వొకటిన్నీ వూరికే వచ్చేది లేదు.

ఇందుకోసం జనార్దనరావుగారు డబ్బు కోరారు.

జనార్దనరావుగారు ఇందుకోసం తమ జీవితమే ధారపొయ్యడానికి సిద్ధపడగా, సంవత్సరానికి నాలుగేసి రూపాయలు ధారపొయ్యడానికి సిద్ధపడగలవారు రెండు కోట్ల అరవై మూడు లక్షల ఆంధ్రులలో రెండు వందలైనా లేకపోయారు.

అయినా వారు నిరుత్సాహపడలేదు. తమ ప్రయత్నం చాలకపోయిందేమో అనుకున్నారు వారు.

కద్దరు కట్టినీ, లాఠీదెబ్బలు తినిన్నీ, గాంధీగారి పేరూ, స్వరాజ్యం పేరూ వుదహరిస్తూ పెద్ద కభుర్లు చెప్పిన్నీ పద్యాలు కట్టే వుత్సాహం వుబికినప్పుడు, దాన్ని, అమ్మాయిలమీదకి తిప్పే రకంవారు కారు వారు.

జనార్దనరావుగారు నైష్ఠికబ్రహ్మచారులు. రమారమీ పాతికయేళ్ల వయస్సులో వుండిన్నీ వారు వివాహవాంఛ పెట్టుకోలేదు. బహుశా, వారు, శాశ్వతబ్రహ్మచర్యదీక్ష పూనినారేమో?

ఏమయితే యేం?

తమ అయత్నం చాలకపోయిందేమో అనుకున్నారు వారు.

ఇలా అనుకుని వారు నిరుత్సాహపడలేదు. దీక్ష దృఢపరుచుకున్నారు. ఉత్సాహం పెంచుకున్నారు. నిద్రాహారాల విషయంలో అశ్రద్ధ చూపించారు. ఏటి కెదురీత ప్రారంభించారు.

కాని ఎంత చేసినా, యేం చేసినా ఒక్క సంవత్సరమేనా సాఫీగా వెళ్లలేదు. ఊరూరూ తిరిగినా—రాత్రీపగలూ తిరిగినా ఉదయిని విలవ గ్రహించగలిగిన రసికులు వారికి కనపడలేదు. దేశంలో వెంటనే నెరవేరవలసిన మొదటి పని యేమిటో గుర్తించినవారు కనపడలేదు. అదృష్టి వున్నవారు సైతం కనపడలేదు.

భారతి ఆఫీసులో వున్నప్పుడు గుబురుగా చిగిరించి, ముమ్మరంగా మొగ్గతొడిగి, విరగబూసి వునట్టు కనపడిన ఆంధ్రదేశం, ఉదయినికి సంచిక తరవాత సంచిక తయారైన కొద్దీ మోడై మాడిపోయివుండడం వారికి బాగా తెలిసివచ్చింది.

ఒకనాడు, ఉదయం, చింతాద్రిపేటనుంచి ప్రబుద్ధాంధ్ర, పరశువాకంనుచి ఉదయినీ కాళ్లీడ్చుకుంటూ బయలుదేరినవి. ఎగ్మోరుస్టేషను అవతలి వంతెనమీద కలుసుకున్నవి.

ఇంకిపోతూ వున్న జీవనదీ, ఎండిపోతూ వున్న కల్పవృక్షమూ, సమావేశం అయినట్టున్నది ఆసమావేశం.

సూర్యుణ్ణి అస్తగిరి దాచివెయ్యగా చంద్రుణ్ణి కారుమబ్బు కమ్ముకున్నట్టున్నది ఆసమయం.

అయినా సమానధర్ముల సమావేశం కనక దుర్బలాలై వుండినా హృదయాలు ఉప్పొంగిపోయినవి. ఏమి చేమిటో కభుర్లు వెళ్ళినవి.

ఉన్నట్టుండి "ఆంధ్రజాతి యిప్పు డెక్కడ వున్నదీ?" అని ప్రబుద్ధాంధ్ర ప్రశ్నించినది. "నరకం కంటె అధమాధమమైన లోకంలో—హిందూస్థానీవాడి కాలికింద" అని ఉదయిని జవాబు చెప్పినది.

ఉదయినిలో ఝుమాయించి రాయలేకపోయారు; కాని—కాంగ్రెస్సు మొగం చూచి కొంచెం తటపటాయించారు గాని, జనార్దనరావుగారు, హిందీదురాక్రమణం పూర్తిగా గ్రహించారు.

"ఇంగ్లీషు నేర్చుకోవడం మనం బాగుపడడానికి, హిందీ నేర్చుకోవడం మన భాషని చంపుకుని, హిందీని బాగుచెయ్యడానికి" అని వా రన్నప్పుడు ప్రుక్కి వుండినా, గంభీరంగానే వుండిన ఆమొగం మీద వీరతేజస్సు మెరిసి "ఆంధ్రవాఙ్మయానికి ఉజ్జీవనం కలిగించగల వ్యక్తి" అని అనిపించినది.

కాని, వా రుండగానే ఉదయిని యెత్తుపడిపోయింది.

ఒకమూల, అడుగడుగునా ఆర్థికాఘాతాలు కదుములు కట్టిస్తూ వుండగా—ఇంకోమూల నిరుత్సాహం పేగులు తోడేస్తూవుండగా వారిని దారుణమైన వ్యాధి అలుముకున్నది.

దినదిన గండంగా అయినా పత్రిక నడుస్తూ వుంటే, వారు, రుణపడిపోయివుందురు; గాని జబ్బుపడి, చివరికి చనిపోయి వుండకపోవుదురు.

మళ్ళీ జనవరి మొదటి వారంలో కలుసుకున్నప్పుడు రోగం మళ్ళిం దనుకున్నాము. అపాయం తప్పిం దనుకున్నాము.

ఆవేళ సాయంత్రం, మల్లంపల్లి సోమశేఖరశర్మగారు కాల్చి యిచ్చిన బ్రౌణ్రొట్టెముక్కలు తింటూ, నవ్యసాహిత్యపరిషత్తునుగురించి చెబుతూ, వారు కనబరిచిన ఆవేదన యింకా స్ఫుటంగా స్ఫురిస్తూనే వున్నది. వా రప్పుడు పలికిన మాటలింకా చెవులలో ప్రతిధ్వనిస్తూనే వున్నవి.

అయితే, మొదట మొదట ఆమాటలు బోధపడలేదు; కాని వెళ్ళిన కొద్దీ—ఏమి ధోరణి అదీ? నవ్యసాహిత్యపరిషత్తు విషయంలోకూడా జనార్దనరావుగారు సమానధర్ములేనా?

చాలా ఆశ్చర్యం కలిగింది.

* * *

ఇక యిప్పుడే మనుకున్నా యేమీ లాభం లేదు.

నవ్యాంధ్రసాహిత్యరథాన్ని విశిష్టపంథాలో నడిపించగల ప్రముఖులలో వొకరైన జనార్దనరావు గారు అకాలమృత్యువు వాత పడ్డారు.

అయితే, వారి ఆత్మకి మేము శాంతి కోరము.

ఆంధ్రసాహిత్యాన్ని గురించి. అది, అనేకవిధాల మథనపడి పోయింది.

జనార్దనరావుగారు తమ కార్యక్రమం పూర్తిగా కాకపోతే కొంతవరకైనా సాగించడానికి తగిన సందర్భాలు లేకపోయాయి.

అంచేత యెవ రెన్ని విధాల యెందరెందర్ని ప్రార్థించినా వారి ఆత్మకి శాంతి కలగదు.

కనక నేను జనార్దనరావుగారు మళ్ళీ—వెంటనే తెనుగుదేశంలో పుట్టా లని కోరుతున్నాను.

—శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి.

* * *

ఒక నూతన రహస్యము

౭౧ సంవత్సరముల ప్రాయముగలిగిన బెంజమిన్ రాన్ యను నొక జర్మను రసాయనికు డిటీవలన యింగ్లాండుయందు పాలనుండి పట్టు తయారుచేసి ప్రపంచ వైజ్ఞానికుల విస్మయపరచెను. ఈతడు సుమారు ౧౦ సంవత్సరములనుండి నిరంతరముగా తన పరిశోధనాలయమునందు తనప్రయత్నమును సాగించి నేడు చక్కనిరంగులు గలిగిన సున్నితమగు పట్టును పాలనుండి సిద్ధపరచి చాలావరకు సఫలుడయ్యెను.

క్రీ ౧౯౩౧ సం॥న తాను పరిశోధనాలయమునందు సిద్ధపరచిన కృత్రిమపట్టును, సహజమగు, అనగా కీటకములనుండి తీయబడిన పట్టును కలిపి బర్లిన్ నగరమందలి పృథఃకరణాలయమునకు పరీక్షార్థము బంప అచ్చటి పరిశోధకులు పృథఃకరణ మొనర్చుటయందు విఫలులై. 'విడదీయుటసంభవ'మని విశదపరచిరి.

ఈతడింతవరకు సుమారు 3 లక్షల రూప్యములు పరిశోధనకై వెచ్చించినను తృప్తిజెందక తనపరిశోధనను మరింత తీవ్రతతో సాగించుచు దానియందుండిన లోపమును పూర్తిగా కనుగొనుటకు కృషి సలుపుచుండుట ఆతనిపట్టుదల పూర్తిగా విశదమగుచున్నది. కాని యుత్తమ పట్టులక్షణముల రహస్య మీతనికి తన పట్టుయందింకను పట్టుబడకున్నది.

వర్ణసౌందర్యము, పటుత్వము, మృదుత్వము స్థితిస్థాపకత్వము, ముకుళరహితత్వము మొదలగు ప్రాధాన్యాంశములు తన పట్టుయందు గలిగితీరునని యాశించుచున్నాడు. ప్రస్తుత మీతనిచే తయారు చేయబడిన పట్టుయందు నాలుగులక్షణములు విశదమగుచున్నను పరిపూర్ణాంశము మాత్రము లోపించుచునేయున్నది.

పరిశోధనయందిటీవల యవలంబించిన పద్ధతి వలన కొంతసాఫల్యత చేకూరినదనవచ్చును.

పట్టు కీటకములకు ముఖ్యాహారము కంబళిలేక పూతికపండ్ల చెట్లాకులు. రెండు మంచిఆవులకు వీని యాకులనే మేపి వానితో సమానమగుపట్టును తయారుచేసి తీరెదనని యీతని ప్రయత్నము.

"ఆరోగ్యవంతములైన రెండుఆవుల నేరుకొని వారమురోజులవరకు వాని సహజాహారముపై మేపుచుందును. ఆపై వానిపాలను పరీక్షించెద; దానియందలి వెన్నను పరీక్షించెద; మీగడదీసినపాల విరుగును పరీక్షించి చూచెద. నాపృథఃకరణ పట్టుకీపాల విరుగుడే ముడిపదార్థము."

"ఆపై వీనిమేతయందు కొంత కంబళియాకు కలిపి వీనిని మేపి ఆపైన పాలు, వెన్న పాలవిరుగుల పరీక్షించెద. అటుతర్వాత మూడువారముల మట్టుకు పూర్తిగా కంబళిఆకులనేమేపి పైయంశయలను పరీక్షించిచూచెద.

"కంబళియకుల మేసిన ఆవుపాలనుండి పాలవిరుగుడు నాపట్టుపరిశ్రమకు తదితరములకన్న మిగుల సాయకారిగా దేలినదానిని రసాయనిక పృథఃకరణ మొనర్చి మూడింటియందలి భేదాంశముల రహస్యము కనుగొనుటకు ప్రయత్నించెద."